
# ఒక్క రోజు

[కథానిక]

●

శ్రీమతి ఆచంట శారదాదేవి




అప్పుడే తెల్లవారుతూంది :

కిటికీలోనుంచి ఒక్క వెలుగుకిరణం శాంత ముఖంమీద పడింది ;—శాంతకు మెలుకువ వచ్చింది.

అయినా, పూర్తిగా నిద్దురబద్ధకం వదలలేదు ;

నిద్రకళ్లతో కిటికీలోనుంచి బయటకు చూసింది.

నిద్దురకళ్ళతోనే మందారపువ్వులు పలుకరించినాయి.

ఒక్కక్షణం ఆమెహృదయం అటువైపు ప్రశాంతంలో లీనమయింది...

*       *       *

ఉన్నట్లుండి మిన్నువిరిగి మీదపడినట్లు ఏకరణగొణధ్వని !

దొడ్డివైపునించి 'కావు కావు' మంటూ కాకుల సమూహం ;

వీథివైపునించి 'బొంయ్' మంటూ కార్ల సమూహం ;

బావిదగ్గర పంచమశ్రుతిలో పనిమనిషి ;

వాకిలి దగ్గర మధ్యమ శ్రుతిలో కూరల మనిషి;

—అందరూ రకరకాల గొంతుకలతో 'ఇంక ప్రపంచంలో శాంతి లే' దని బృందగానం మొదలు పెట్టినారు.

ఆ గోలకు ఎవరికైనా మెలుకువ వస్తుంది.

శాంతను మెలుకువతోపాటు ఆమెను నిత్యజీవితంలో బాధిస్తున్న సమస్యలన్నీ ఒక్క పెట్టున ఆవరించాయి.

ఎప్పుడూ రాత్రి, ఎప్పుడూ నిద్ర అయితేనే బాగుంటుందేమో ! అప్పుడు తీరని సమస్య లేమీ వుండవు ;

ఆశ, నిరాశ, అసంతృప్తి—వీటిబాధ ఏమీ వుండదు.

కాని రాత్రిఅంతా వేకువకోసం, పగలంతా రాత్రికోసం కనిపెట్టుకుని వుండటమే జీవితం.

అయినా ఇవ్వాళ ?—

ప్రతిరోజూ ఏదో మార్పు వస్తుందని వట్టిభ్రమ.

అన్నిరోజుల్లాగే ఈ రోజూ గడచిపోతుంది.

అంతే !—

*       *       *

మామూలుగానే మేడ దిగి వచ్చింది శాంత.

మామూలుగానే రమణమ్మ కూరలు బేరం చేస్తోంది.

'బెండకాయలు అరణాల కిస్తావా ?'

'అదేంటండి ? వీశ ముప్పావలా అమ్ముతూంటేను !'

'ఈ కబుర్ల కేంలే ! అరణాల కిస్తే ఇయ్యి, అర వీశ'

'అబ్బే—ఇదేం బేరమండి ! అన్ని మండిపోతూంటే!'

అంతే.—విసుగొచ్చి తను కలుగజేసుకుని తీర్పు చెప్పేదాకా ఆ వాదన అట్లా సాగుతూనే వుంటుంది. రోజూ ఈ ఘోష లేకుండా వుండేటందుకు కూరలకు ఎంత ధర ఇచ్చినా ఇవ్వవచ్చు.

*  *  *

త్వరగా స్నానంచేసి తల దువ్వుకుంది.

ఇవ్వాళ రాణీ, తనూ కలిసి మల్లెతోటలోకి వెళ్లా లనుకున్నారు.

తెల్లవారేసరికి పువ్వులన్నీ విచ్చివుంటాయి.

ప్రొద్దుటిపూట తోట ఎంత బాగుంటుందో !

ఆ పువ్వుల వాసన తల్చుకుంటేనే ఆమెకు వింత మత్తు కలిగింది.

ఏనాడు ఆమెహృదయం మల్లెపూలతో స్నేహం చేసుకుందో కాని, మల్లెపూలను చూచినప్పుడల్లా ఆమెహృదయం వుప్పొంగిపోతుంది...

తోటలోనికి వెళితే...

అమ్మయ్య !...

ఒక్క గంటసేపైనా ఈ కలవరాన్నంతా మరచిపోయి విశ్రాంతిగా వుండవచ్చు...,

*  *  *

బాబు వచ్చాడు.

'అమ్మా, తలనొప్పిగా వున్నదే...'

నుదుటిమీద చెయ్యివేసి చూసింది శాంత. మసలిపోతూంది.

'పడుకో బాబూ ! జ్వరం వచ్చినట్లుంది !!'

బాబును పడుకోబెట్టి డాక్టరుకు కబురు చేసింది.

'అమ్మా! ఎక్కడికీ వెళ్ళకు !—ఇక్కడే వుంటావు కాదూ ?'

'ఎక్కడికీ పోను బాబూ! ఇక్కడే వుంటాను!'

అక్కడే కుర్చీలో చతికిలబడింది.

ఈ జ్వరం అనుకోకుండా ఈవేళే రావాలా ?

ఏమో ! ఇది కాకపోతే ఇంకేదైనా అడ్డు వచ్చి వుండవచ్చు.

ఎంత ప్రయత్నించినా ఈ బంధనలోనుంచి తప్పించుకోలేదు. పాపం! రాణి తనకోసం ఎదురు చూస్తూ వుంటుందేమో ?...డాక్టరు వచ్చి చూసి మందిచ్చివెళ్ళేడు.

ప్రమాదమైన జ్వర మేమీ కాదు. సాయంత్రానికి తగ్గిపోవచ్చు.

బాబు నిద్రపోయాడు.

కాని ఈపాటికి రాణి వెళ్ళిపోయివుంటుంది.

*  *  *

రమణమ్మ వచ్చింది :

'ప్రక్కఇంటివాళ్లు మళ్ళీ నిన్నరాత్రి మన చెట్టు అరటాకులన్నీ కోసుకున్నారు !'

'పోనీలే, వారింటికి రాత్రి మళ్ళీ చుట్టాలొచ్చారేమో'

'మళ్ళీ ప్రొద్దున్న ఎంగిలాకులన్నీ మన దొడ్లోనే పడేశారమ్మా'

రమణమ్మ ఉద్రేకం ఆగడంలేదు.

'పోనీలే. పనిమనిషిని ఎత్తమను'

'ఎప్పుడూ ఇంతే. మీరు వూరుకునేకొద్దీ వాళ్లు ఇంకా చేస్తారు.'

ఊరుకోక ఏం చెయ్యాలి ? వాళ్లతో పోట్లాడాలా ? అది తనకు ఈ జన్మలో సాధ్యమయ్యే పని కాదు.

రమణమ్మ తన ఉద్దేశ్యం చెప్పేసింది.

'ఏమైనా సరే నమ్మా. ఇవ్వాళ మీరు అడిగితే అడగండి. లేకపోతే నేను నోరు చేసుకోక తప్పదు.'

శాంత అదిరిపడింది.

రమణమ్మ అనుకున్నది మార్చడం ఎవరికీ చాత కాదు. ఆవిడ ఈ తీర్మానానికి ఫలితం ఏమిటో శాంతకు బాగా తెలుసు. ఇటు రమణమ్మ ఒక్క నోరు చేసుకుంటే అటు వారు పదినోర్లు చేసుకోవడం, ఈ గొడవ భరించలేక ప్లీడరుగారు తనమీద విరుచుకు పడడం.

ఇది మామూలే.

'రమణమ్మా!'

ఊహుం! ఆవిడ అప్పుడే దొడ్లో యుద్ధం ప్రకటించింది. ఇంక ఎంత అరచినా ఆవిడకు వినిపించదు. చెవిటివానిముందు శంఖం వూదినట్లే.

వీధివైపునుంచి ప్లీడరుగారి కేకలు వినబడుతున్నాయి.

'ఏమి టాగోల? ఇల్లా, చేపలబజారా!'

—ఇదీ వరస.

ఈ గొడవలోనుంచి తప్పించుకొని ఎక్కడికైనా పోవా లనుకుంది. కాని వంటయింటికీ, కచ్చేరి సావిడికీ మధ్య వున్నది వక్కటే గదికాబట్టి అక్కడే ఆగిపోవలసివచ్చింది.

* * *

తుపాను అణిగింది.

పరధ్యానంగా ఏదో పుస్తకం చేతితో పట్టుకుంది.

తనకు తెలియకుండానే పేజీలు త్రిప్పుతున్నది. కాని ఏమీ అర్థ మయ్యేట్లు లేదు.

'నా రేజరు బ్లేడు చూశావా?'

ఉలికిపడింది.

ఎప్పుడూ ఇంట్లో ఏమూల చూసినా రేజరు బ్లేడులే వుంటాయి. కాని ప్లీడరుగారికి కావలసినప్పుడు మాత్రం ఒక్కటీ కనబడదు! రోజూ చూస్తున్నా ఈ విచిత్రం శాంతకు వింతగానే వుంటుంది.

'నా కెందుకండీ మీ బ్లేడు? ఏమన్నా కూరలు తరుక్కుంటానా?' అని వెఱ్ఱిగా అనుకున్నది. ప్లీడరుగారు బీరువాలోని పుస్తకాలన్నీ తీసి ఒక్కొక్కటే క్రింద గిరవాటువెయ్యడం మొదలుపెట్టేరు.

'అబ్బే! పుస్తకాల బీరువాలో ఎందుకుంటుందండీ!!'

'నీకెందుకు? నీవు వెతక్కపోగా పైగా—'

మాట్లాడకుండా వెళ్ళిపోయింది... తను బ్లేడ్ వెతుక్కువచ్చేసరికి ప్లీడరుగారు బీరువా ఖాళీచేశారు. బ్లేడ్ చేత్తో పుచ్చుకుని అద్దంముందుకు వెళ్ళారు.

అమ్మయ్య!

మళ్ళీ పుస్తకం తీసుకోబోయింది.

'నా జేబురుమాలు చూశావా?'

చూడలేదు. కాని ఇప్పుడు చూడాలి. ఎక్కడ వున్నదని?

ప్లీడరుగారు సణుక్కుంటున్నారు.

'నెలకు రెండుడజన్లు కొనుక్కుంటాను. సమయానికి వక్కటయినా—'

అలమారలోని ఇస్త్రీబట్టలు, బుట్టలోని మాసిన బట్టలు, అన్నీ బయటికి వచ్చినతర్వాత—జేబురుమాలు ప్లీడరుగారి జేబులోనే దొరికింది!

'నా చెప్పు లేవీ?'

చెప్పులు బహుశా మేడమీద పడకగదిలో దొరకవచ్చు. రోజూ అవి అక్కడికి ఎలా వెళతాయో మాత్రం ఎవ్వరూ చెప్పలేరు.

ప్లీడరుగారు మొదలుపెట్టేరు.

'ఎవరూ నా సంగతి కనుక్కునేవాళ్లే లేరు! కొంచెం ఇవన్నీ చూడకూడదూ, పుస్తకం చేతితో పట్టుకొని నిద్రపోకపోతే?'

ఇది మామూలుపాఠమే. ఇదంతా శాంతకు కంఠతా వచ్చును.

రోజురోజూ జాగ్రత్తగా వుండాలని అనుకుంటుంది.

రోజురోజూ మరిచిపోతూ వుంటుంది...

వీధి తలుపు ఫెడేలుమని చప్పుడయింది.

ఇల్లంతా అరణ్యంలాగ వున్నది. చుట్టూ ఇస్త్రీ బట్టలు, మాసిన బట్టలు, పుస్తకాలు, న్యూస్ పేపర్లు— మధ్యన చతికిలబడింది. అవన్నీ తన్ను చూసి నవ్వుతున్నట్లు వుంది. తనకూ నవ్వువచ్చింది. ఏదో కోర్టు అనీ, ఆఫీసనీ వుండబట్టి సరిపోయింది. కాని, ఈ మగవాళ్ళు ఇరవై నాలుగు గంటలూ ఇంట్లోనే వుండేటట్లయితే!...

నవ్వుకుంటూ లేచి ఇల్లంతా సర్దుకుంది.

వెళ్లి, బాబువద్గర కూర్చుంది.

ఎండ మాడిపోతున్నది. తోటలో చెట్లన్నీ ఈ యెండకు తట్టుకోలేక, తప్పించుకు పోలేక, వాడిన ముఖాలతో ఆయాసపడుతున్నాయి. చివరకు అలసిపోయి ఈ యెండలో ప్రాణాలు నిలుపుకోలేమని నిరాశతో తలలు వాల్చుకున్నాయి.

అప్పటికి సూర్యుడు దయదల్చి చల్లబడ్డాడు.

*   *   *

మధ్యాహ్నంనుంచి రమణమ్మగారి గొంతు వాగుతూనేఉంది.

'కొళాయిగొట్టం విరిగిపోయింది. నీళ్లన్నీ ఇల్లంతా నిండిపోతున్నాయి'

'వంటఇల్లు చెరువులాగ వున్నది. ఒక్కసారి వచ్చి చూడమ్మా!'

'స్టోరురూము తలుపు బిగుసుకుపోయింది. ఎంత తోసినా రావటంలేదు...'

'పాలన్నీ పిల్లి తాగిపోయింది. ప్లీడరుగారికి కాఫీలేదు!'

'బాబుకు జావ కావాలి. గోధుమరవ లేదు!'

'నిన్నటినుంచి చిన్న వెండిగిన్నె కనపడటంలేదమ్మా—ఏమైపోయిందోకాని'

చిన్నచిన్న విషయాలను పెద్దపెద్ద సమస్యలుగా తయారుచెయ్యడం ఒక్క రమణమ్మకే చాతనవును.

అయినా ఈ చిన్న విషయాలే ఎంత బాధ—ఎంత ఇబ్బంది—కలిగిస్తాయి!

సాయంత్రం మబ్బుగా వుంటే, వర్షం కురుస్తుందేమో ననుకుంది. కాని మబ్బులన్నీ విడిపోయి వెన్నెల వచ్చింది.

డాబామీద నక్షత్రాలకేసి చూస్తూ పడుకుంది.

తెల్లవార్లూ అల్లాగే చందమామనూ, నక్షత్రాలనూ చూస్తూ గడపగలదు.

రోజూ చూస్తూన్నప్పటికీ వీటి ఆకర్షణ తగ్గదు.

అబ్బా! ఈ వెన్నెల ఎంత హాయిగా వుంది!

నీలి పట్టుచీరమీద జరీపువ్వుల్లాగ ఈ నక్షత్రాలెంత బాగున్నాయి?

'ఇక్కడున్నావా!' ప్లీడరుగారి గొంతు.

'బాబుకు జ్వరం తగ్గింది కాదూ?'

'ఆ! చెమట్లు పోస్తున్నాయి. నిద్రపోతున్నాడు'

ఏమీ తోచక ఆకాశంకేసి చూస్తూ కూర్చున్నారు—కాసేపు.

'చూడు, ప్రొద్దున్న అనవసరంగా విసుక్కున్నా'...

శాంత చిరునవ్వు నవ్వింది.

—తెల్లవారే వరకూ ప్లీడరుగారు పరమశాంతమూర్తి!

'ఎందుకు నవ్వుతావు?...చూడు! రేపటినుంచి ఒక్కమాటైనా అంటే ఒట్టు.'

రేపటినుంచి!

'రేపు!' శాంతహృదయం ఒక్కసారిగా ఉత్సాహంతో ఉప్పొంగింది. తెల్లవారుతుంది. రేపు వస్తుంది. ఇవ్వాళ చెయ్యలేని పనులెన్నో రేపు చెయ్యవచ్చు. రేపు మల్లెతోటకు వెళ్ళవచ్చు. రేపు వీణ వాయించుకోవచ్చు. మరచిపోయిన పాటలన్నీ మళ్ళీ జ్ఞాపకం చేసుకోవచ్చు. ఈ ఆశతో ఆమెహృదయం తృప్తిపొందింది.

నిన్న......ఇవ్వాళ......రేపు...

వీటిలో నిజంగా ఏమీ తేడా లేదు.

అయినా 'ఈవాళ' గడచిపోయిందని నిట్టూర్పు; 'రేపు' వస్తుందని ఆశ.

కాని ఈ రాత్రి, ఈ చల్లదనం, ఈ ఆశే లేకపోతే!